# సత్యవాక్యం

## The Word of Truth

క్రైస్తవ మాసపత్రిక

DECEMBER 1997

# సంక్షిప్త వార్తలు

అక్టోబరు 31వ తేదీనుండి నవంబరు 3వ తేదీవరకు విజయనగరంజిల్లా చీపురుపల్లి ఏరియాలో అమెరికానుండి వచ్చిన సోదరులు రోయస్ ఫ్రెడరిక్‌గారు, హర్షల్ బియర్డెన్ గారు మరియు హోవెల్ ఫెర్గూసన్ గార్లు పర్యటించి, అనేక గ్రామములు దర్శించి సువార్త ప్రకటించిరి. ఆ సందర్భముగా 31మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. మరియు నవంబరు 4వ తేదీనుండి 8వ తేదీ వరకు ఆ ఏరియాలో యున్న సువార్తికులకు హర్షల్ బియర్డెన్ గారు ప్రత్యేక క్లాసులు నిర్వహించిరి. చీపురుపల్లి ఏరియాలో సోదరులు యం. పాల్‌రాజు గారు క్రీస్తుకొరకు గొప్ప సేవ చేయుచున్నారు.

నవంబరు 4నుండి 7వరకు సోదరులు రోయస్ గారు, హోవెల్ గారు శ్రీకాకుళం ఏరియాలో సోదరులు ఆర్.సి.హెచ్. సద్గుణరావ్ గారితో క్రీస్తుసువార్త పరిచర్యలో పాల్గొనిరి. శ్రీకాకుళం జిల్లాలో సోదరులు సద్గుణరావ్ గారు క్రీస్తు సంఘమునకు బలమైన సువార్తికునిగా పనిచేయుచున్నారు. అటు తరువాత సోదరులు రోయస్ గారు అనకాపల్లి ఏరియాలో రెండు దినములు సోదరులు కె.ఫ్రాన్సిస్ సుధాకర్ గారితో సువార్త పనిలో పాల్గొనిరి.

నవంబరు 14వ తేదీ శుక్రవారం నాడు సోదరులు జాషువాగూటం గారు, రోయస్‌ఫ్రెడరిక్ గారు అమలాపురం మండలంలో నడిపూడి గ్రామమును సందర్శించి అక్కడ జరిగిన కూటములో వాక్యపరిచర్య గావించిరి. కూటము అనంతరం 10మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. నడిపూడిలో సోదరులు జి.అబ్రాహాము గారు సువార్తికునిగా పనిచేయుచున్నారు.

నవంబరు 15వ తేదీ శనివారం పెద్దాపురం మండలం గుడివాడ గ్రామములో నెలవారీ జరుగుచున్న సువార్తికుల యొక్కయు యౌవనస్థుల యొక్కయు సదస్సు జరిగెను. పెద్దాపురం, జగ్గంపేట, కిర్లంపూడి, రాజమండ్రి మండల ప్రాంతములలో యున్న క్రీస్తు సంఘ సువార్తికులు, సభ్యులు ఇంచుమించు 250 మంది ఆరోజు హాజరైరి. ఆ సదస్సులో "నేడు దేవుడు ఎట్లు మాట్లాడుచున్నాడు?" అను అంశము చర్చించబడెను.

# సత్యవాక్యం

## THE WORD OF TRUTH



**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

Phone : 0884-63722

**Editor :** **J.C.CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**



**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 18 | డిశంబరు 1997 | సంచిక 5


## సంపాదకీయం

## ఆత్మఖడ్గము

( The Sword of the Sprit )

మొదటి శతాబ్దములో క్రొత్త నిబంధన వ్రాయబడు సమయానికి ప్రజలు తుపాకిలను గాని, ఆధునిక మారణాయుధములను గాని ఎరుగరు. గాని వారు కత్తులను, ఖడ్గములను కవచములను మొదలగు వాటిని ఎరుగుదురు. గనుక పౌలు క్రైస్తవుని ఒక సైనికునిగా పోల్చి అతడు దేవుని సర్వాంగ కవచమును ధరించుకొనవలెనని హెచ్చరించినప్పుడు అతని ఆయుధము దేవుని వాక్యమను ఆత్మఖడ్గమని సూచించెను (ఎఫెసీ 6:16). "ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్ళను మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది". యని హెబ్రీ పత్రిక లేఖకుడు వ్రాసెను (హెబ్రీ 4:12). గనుక "దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్తపడుము" అని పౌలు యౌవన

సువార్తికుడైన తిమోతిని హెచ్చరించెను (2తిమోతి 2:15).

పైన చెప్పబడిన వచనములలో అనేకసత్యములు కనబడుచున్నవి. మొదటిగా దేవుని వాక్యము ఖడ్గము వంటిదియని చెప్పబడెను. దీని ఉద్దేశమేమంటే, ఖడ్గము వాడియైనది, యుద్ధభూమిలో నుపయోగింపబడు ఒక ఆయుధమది. మరియు ఆత్మరక్షణార్ధము ఉంచుకొనే పరికరము. అది ఈ ప్రయోజనములకుపయోగ పడునట్లు దానిని వినియోగించువాడు దానిని ఎరిగినవాడై యుండవలెను. దాని ప్రయోజనమును గుర్తించినవాడై దానిని సరిగా నుపయోగించువాడై యుండవలెను. వీటిని గూర్చి ఎవడైనను అజ్ఞానియైయుండి, దానిని వినియోగించుటలో అనుభవము లేనివానిగాను ఉన్నయెడల దాని ప్రయోజనము శూన్యమగును లేదా అది చాల అపాయకరమగును సరిగదా అతని నాశనమునకు కారణమగును.

ఇదే సంగతి ఆత్మ ఖడ్గమైన దేవుని వాక్య విషయములో సత్యమగును. దాని వినియోగించిన రీతిని బట్టి అది ఒకనికి ఆశీర్వాదములను తెచ్చును లేదా నాశనము చేయును. దేవుని వాక్యమును చులకనగా నెంచరాదు కాని అది దేవుని నుండి వచ్చినదని గౌరవించవలెను, గనుక సరిగా నుపయోగించవలెను.

దేవుని గ్రంథములో వ్రాయబడిన సంగతులు మనము విశ్వసించునట్లు వ్రాయబడెను (యోహాను 20:30-31). దేవుని వాక్యమును వినుటవలన విశ్వాసము కలుగునని పౌలు చెప్పుచున్నాడు (రోమా 10:17). మనము వాక్య ప్రకారము ప్రవర్తించువారై యుండవలెననియు, స్వాతంత్ర్యమిచ్చు సంపూర్ణ నియమములో నిలుకడగా యుండవలెననియు యాకోబు చెప్పుచున్నాడు (యాకోబు 1:22,25). ఆయన ఆజ్ఞలను మనము గైకొనవలెననియు, ఆయన వాక్యమే సత్యమనియు, అది మనలను స్వతంత్రులనుగా చేయుననియు క్రీస్తు చెప్పుచున్నాడు (యోహాను 14:15; 17:17; 8:32). ఆయన వాక్యము నిత్యము నిలుచుననియు, అంత్యదినమున మనలనది తీర్పు తీర్చుననియు ఆయన మరల చెప్పుచున్నాడు (మత్తయి 24:35; యోహాను 12:48), అందువలన మనము సత్యమును ప్రేమించి, విశ్వసించి, దానికి లోబడి నైపుణ్యతలో దానిని వినియోగించవలెను.

ప్రభువుయొక్క వాక్యమును మనము వినుటకు, విశ్వసించి దానికి లోబడుటకు నిరాకరించిన యెడల దానిని గూర్చి మనకు ప్రేమలేదు. అజాగ్రత్తగా దానికి కలిపిన, దానినుండి తీసివేసిన, దానిబదులుగా వేరొక దానినుంచిన, మనము దానిని సరిగా వినియోగించకపోయిన లేదా అసత్యముతో మిళితముచేసి దానిని బోధించిన అది మనలను రక్షించదు సరిగదా దానినట్లు వినియోగించువారినది శిక్షించి నాశనము చేయును. దేవుని వాక్యము వలన మనము రక్షింపబడవలెను గాని శిక్షింపబడరాదు. దేవుని వాక్యమును వినియోగించుట ద్వారా ఆత్మలను ప్రభువు నొద్దకు రక్షణలోనికి నడిపించవలెను గాని వారి నాశనమునకు కాదు. గనుక మనము సత్యమును ప్రేమించి దానిని అన్వేషించు వారిగను, సత్యము గ్రహించి, విశ్వసించి, దానికి విధేయత చూపి ఇతరులకు దానిని బోధించునట్లు దేవుని వాక్యమును దివారాత్రులు ధ్యానించువారిగ మనముండవలెను.

దీనినంతటిబట్టి దేవుని చిత్తము మానవునికి బయలు పరచబడెనని చెప్పుటవశ్యము. మనమాయన వాక్యమును కలిగియుండి సత్యమును తెలిసికొన వలెనని ఆయన కోరుచున్నాడు. సత్యముకంటె తక్కువైన దేనితోను మనము సంతృప్తి జెందరాదు. అయితే మనము దానిని కనుగొని దానికి విధేయత చూపినప్పుడు మనము దానిని ఇతరులకు సరిగ ఉపదేశించునట్లు దానిని చదివి ధ్యానిస్తు యుండవలెను. దేవుని వాక్యమును సరిగ నభ్యసించనివాడు మోసగించబడి ఈడ్చుకొనపోబడును. లేదా అతడు నిరుత్సాహపడి విరమించుకొనగోరును. నేటిక్రైస్తవలోకము అతనిపైకి విసరు ప్రశ్నలకతడు జవాబీయలేని యెడల తాను బోధించయత్నించు వారిలో తన పలుకుబడిని కోల్పోవును. అతని బైబిలు జ్ఞానము స్వల్పమైన యెడల అతడు బహుశ అసత్యమును బోధించవచ్చును. గనుక అతడు సత్యమును బోధించునట్లును, అసత్యమును ఖండించునట్లును మరియు అతనిపైకి వచ్చు మతసబంధమైన ప్రశ్నలకు తగు రీతిగ జవాబిచ్చునట్లును అతడు సరిగ సిద్ధపడియుండవలెను. ఒకడు దేవుని వాక్యమును సరిగ యెరిగిన వాడయినట్లయిన అతడు దానిని సరిగ నుపదేశించుటకు సిద్ధపడును.

భారతదేశములో క్రీస్తుసంఘము ఇంకా యౌవన దశలోనే యున్నది; మరియు రక్షణపొందుటకేమి చేయవలెనో దానిని మాత్రమే ఎరిగి మార్పుజెందిన వారనేకులున్నారు.; మరియు అనేకులు తక్షణమే వెళ్లి బోధించుటకు ఆసక్తి కలిగిన వారున్నారు. అంతేకాదు క్రొత్తగా మార్పుజెందిన వారికి బోధించి శిక్షణ నిచ్చుటకు సరిపడినంతమంది బోధకులు, ఉపదేశకులు అనుభవములగల సభ్యులు లేనందున మార్పుజెందిన వారిలో అనేకులు ఆత్మీయాకలి వలన చనిపోయేప్రమాదమున్నది; మరియు వారికి తెలిసినదంతా అదేగనుక అనేకులు అసత్యమును బోధిస్తు యుందురు. తత్ఫలితముగా సంఘము చీలికలై ఆయా ఏరియాలో ఉన్న బోధకుల యొక్క శక్తి సామర్థ్యములను బట్టి వారి ననుసరిస్తూ వారికున్న స్వల్ప జ్ఞానముతో నడిపింపబడుచు యుందురు. సంఘము క్రీస్తు సంఘమని పిలువబడుచున్నను అదొక డినామినేషన్‌గా తయారై ప్రభువునకంగీకారయోగ్యముకాని దగును.

ఇట్టి పరిస్థితిని మనము బాగుచేయుటెట్లు? ఈ పనిని మొదట మనము మనతోనే ఆరంభించవలెను. దేవుని వాక్యమునందలి అనుభవమును ఎక్కువ కలిగియుండు నిమిత్తము దేవుని వాక్యమును మనం ఎక్కువ చదువవలెను. ప్రభువు సువార్తకు లోబడిన వెంటనే వెళ్ళి సువార్త ప్రకటించవలెనని కోరుచున్నంత మాత్రాన సరిపోదు. మొదటి సంగతులు మొదటనే చేయవలెను. ఆత్మీయముగా అనుభవము కలిగి ప్రభువు పనిచేయుటకు సిద్ధపడుటకు కొంత సమయమవుసరము. ఒక బోధకుడు ఒక డినామినేషన్‌ను విడిచిపెట్టి క్రైస్తవుడై, క్రీస్తుసంఘస్థుడైనను అతడు దేవుని వాక్యమును తక్షణమే బోధించుటకు సిద్ధపడియుండలేదు. సత్యముయొక్క ప్రాథమిక సూత్రములను సంపూర్తిగా గ్రహించుటకును, అతడు చేసినదానిని బోధించబోవు దానిని సంపూర్తిగా గ్రహించుటకును లేఖనములను పఠించి ధ్యానించుటకును అతనికి కూడ సమయమవుసరము.

దేవుని వాక్యమును నిజముగా బోధించ సిద్ధపడువారు దేవుని వాక్యమును దివారాత్రులు ధ్యానించవలసిన అవుసరత ఎంతో యున్నది. అట్టివారు సిద్ధపడుటకు బైబిలుతో సహా చదువుకొను నిమిత్తము మావద్ద అనేక భాషలలో అనేక

పుస్తకములున్నవి. సంఘారాధనలకు హాజరగుచు, క్రీస్తుసంఘములు చేయుచున్న రేడియో ప్రసారములను వినుచు, స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌కు (బోధకుల తర్ఫీదు పాఠశాలకు) హాజరైన యెడల దేవుని వాక్యమును బోధించుటకు తీవ్రమైన ఆసక్తిగల వారు ప్రజలను నాశనములోనికి నడుపక రక్షణలోనికి నడిపించువారుగ తమ్మును తాము తయారు చేసికొనగలరు.

నిజానికి మనకు చాలమంది బోధకులు అవుసరము. ప్రతిక్రైస్తవుడుకూడా వారిచుట్లుయున్న వారికి బోధించుట ఎంతో అవుసరము. అయితే ఇది ప్రయోజన కారిగ యుండవలెననిన వారికి దేవుని వాక్యజ్ఞానమవుసరము దానిని వారు యితరులతో పంచుకొనుటవుసరము. ఈ దేశములో క్రీస్తు సువార్త వ్యాప్తి చేయుటకును, క్రీస్తు సంఘములను ప్రతి గ్రామములోను పట్టణములోను స్థాపించుటకు ఏమైతే అవుసరమున్నదో దానిని అప్పుడు మాత్రమే చేయగలము. నాశనమునకు గాక రక్షించుటకొరకు ఆత్మ ఖడ్గమును మనము వినియోగించుటకు దేవుడు మనకు సహాయము చేయునుగాక !!

## దేవుడాజ్ఞాపించును, మానవుడు లోబడును
### ( God commands, Man obeys )

దేవుని ప్రేమించుచున్నామని చెప్పుకొనుచు ఆయన మాటలకు లోబడని వారేకులున్నారు. వారు దేవుని నిర్లక్ష్యము చేయుచున్నారు. దేవుని ప్రేమించు చున్నామని, భక్తిపరులమే అని వారు చెప్పుకొందురు గాని వారాయన మాటలను గైకొనరు. అయితే దేవుడు పనిచేయు విధానమును మీరు తెలిసికొనవలెనని కోరుచున్నాను. అదేమంటే దేవుడాజ్ఞాపించును, మానవుడు లోబడును. మానవుడు లోబడిన యెడల దేవుడతనిని ఆశీర్వదించును. అయితే దేవుడాజ్ఞాపించినప్పుడు మానవుడవిధేయత చూపిన యెడల ఆ మానవుని దేవుడు శిక్షించును; ప్రతిదండన చేయును. మానవుడు దేవుని ఆజ్ఞలకు లోబడినప్పుడు ఆయన అతని విశ్వాసమును కనుగొనునని బైబిలు బోధించుచున్నది.

ఒక పుట్టు గ్రుడ్డివాడు తన గ్రుడ్డితనమును బాగుచేయించుకొనగోరి యేసునొద్దకు రాగా ఆయన ఉమ్మితో బురదచేసి, వాని కన్నులమీద ఆ బురదపూసి నీవు సిలోయము కోనేటికి వెళ్లి అందులో కడుగుకొనుమని అతనితో చెప్పెను. వాడు యేసు చెప్పిన రీతిగనే వెళ్ళి కడుగుకొని చూపుగలవాడై వచ్చెను (యోహాను 9:1-7). అతడు యేసు చెప్పిన మాట ప్రకారము చేసినప్పుడే శుద్ధుడాయెను. గాని అంతకు ముందుకాదు.

## నయమాను ఉదాహరణ

పాతనిబంధనలో, రెండవ రాజుల గ్రంధము 5వ అధ్యాయములో ఒక కుష్టరోగిని దేవుడు బాగుచేసెను. అతని పేరు నయమాను. సిరియా దేశపు సైన్యాధిపతియగు నయమాను గుఱ్ఱములతోను, రధముతోను వచ్చి దేవుని ప్రవక్తయైన ఎలీషా యింటి ద్వారము ముందర శుద్ధుడగుటకై నిలిచి యుండగా, "నీవు యోర్దాను నదికి పోయి యేడుమారులు స్నానము చేయుము. నీ ఒళ్లు మరల బాగై నీవు శుద్ధుడవగుదువని" అతనికి చెప్పబడెను. అయితే నయమాను ఈ సామాన్య సూత్రమునకు లోబడనొల్లక కోపము తెచ్చుకొని కుష్టురోగముతో తన దేశము తిరిగి వెళ్ళిపోబోయెను. గాని అతని దాసుని యొక్క మంచి సలహానుసరించి, అతడు పోయి దైవజనుడు చెప్పినట్లు యోర్దాను నదిలో ఏడుమారులు మునుగగా అతని దేహము పసిపిల్ల దేహమువలెనై అతడు శుద్ధుడాయెను. మనము దేవుని ఆజ్ఞలకు లోబడునప్పుడే దేవుడు మన విశ్వాసమును కనుగొనును. అందుకే దేవుని కుమారుడైన యేసుక్రీస్తు, "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" అని చెప్పెను (యోహాను 14:15). మీరు నన్ను ప్రేమించిన యెడల ఏ కారణము చేతనయినను నన్ను నిర్లక్ష్యము చేయకుడి గాని, నిజానికి నా ఆజ్ఞలకు విధేయత చూపుడి అని ఇంకొక మాటలో ఆయన చెప్పుచున్నాడు.

దేవుని అజ్ఞలకు విధేయత చూపని యెడల మానవునికి కలిగే ప్రతి దండన యెట్టిదో కూడ బైబిలు అతి విశదముగ బోధించుచున్నది. దేవుని మాటకు అవిధేయత చూపి నశించిన యిద్దరి మనుష్యులను మనము ఇక్కడ జ్ఞాపకము

చేసికొందము. వారు నాదాబు, అబీహులనువారు; దేవుని ప్రధాన యాజకుడైన అహరోను కుమారులు. వీరిద్దరు యెహోవా తమ కాజ్ఞాపింపని వేరొక అగ్నిని ఆయన సన్నిధికి తేగా యెహోవా సన్నిధినుండి అగ్ని బయలుదేరి వారిని కాల్చివేసెను; వారు యెహోవా సన్నిధిని మృతిబొందిరి (లేవీ 10:1-2).

## అవిధేయత వలన ఆపద

నిర్గమకాండము 32వ అధ్యాయములో ఒక సంఘటనను మనము చదువ గలము. సీనాయి కొండపై దేవుని యొద్దనుండి పది ఆజ్ఞలుగల రెండుపలకలను అందుకొనిన తరువాత, కొండక్రిందనున్న ఇశ్రాయేలీయులు దేవుడు వారికి నియ మించిన త్రోవనుండి తొలగిపోయి తమకొరకు ఒక బంగారు దూడను చేసికొని దానికి మ్రొక్కుచున్నారని మోషే తెలిసికొనెను. అతడు కొండ దిగివచ్చి అందరికి కనబడులాగున పాళెము యొక్క ద్వారమున నిలబడి, యెహోవా పక్షముననున్న వారందరు నాయొద్దకు రండి అనగా లేవీయులందరు అతని యొద్దకు కూడివచ్చిరి. వారట్లురాగా వారిలో ప్రతి వాడును తన కత్తి తీసికొని బంగారు దూడకు మ్రొక్కిని వారందరిని హతము చేయవలెనను దేవుని ఆజ్ఞను మోషే వారికిచ్చెను. ఈ లేవీ కుమారులు దేవుని ఆజ్ఞకు విధేయులైరి. ఆ దినమందు ప్రజలలో ఇంచుమించు మూడువేలమంది కూలిరి యని లేఖనములు చెప్పుచున్నవి. దేవుడు విగ్రహారాధన చేయరాదని ఆజ్ఞాపించెను. ఇశ్రాయేలీయులు అవిదేయత చూపగా దేవుడు ఇంచుమించు మూడువేలమందిని ఒకే రోజున హతము చేసెను.

పాతనిబంధనలోను, క్రొత్తనిబంధనలోను కూడ ఇట్టి సందర్భములను అనేకములను మనము కనుగొనగలము. వాటన్నిటినుండియు మనము నేర్చుకొన వలసిన పాఠము యిదే. దేవుడాజ్ఞాపించును. మానవుడు లోబడును. అవిధేయతను దేవుడు సహించనే సహించడు.క్రొత్తనిబంధనలో అపొస్తలుల కార్యములు 5వ అధ్యాయములో అననీయ సప్పీరా అను దంపతులు దేవుని యెదుట అబద్ధమాడిరి. దేవుడాదినమందు వారిని హతము చేసెను. కల్లలాడు నాలుకను ఆయన అసహ్యించుకొనును (సామె 6:17).

సువార్తను నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడునని యేసుక్రీస్తు ఆజ్ఞాపించెను (మార్కు 16:16). ఈ ఆజ్ఞకు మానవుడు లోబడవలసినదే. నమ్మనొల్లనివానికి శిక్ష విధింపబడును. రక్షింపబడవలెనంటే నీటిలో ముంచడము బొందుట అవుసరము అని బైబిలు బోధించుచున్నది. అయితే బాప్తిస్మము ఒక్కటే ఏ మానవుని ఎన్నడు రక్షించదు. బాప్తిస్మము పొందుమని చెప్పుచున్న వచనమే విశ్వాసము కూడ అవుసరము అని చెప్పుచున్నది. అటు తరువాత ఒకడు మారుమనస్సు పొందవలెను లేని యెడల అతడు నశించును అని కూడ యేసు చెప్పెను. తరువాత యేసుప్రభువు నందలి విశ్వాసమును మనుష్యుల యెదుట అతడు ఒప్పుకొనవలెను. "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోక మందున్న నాతండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యులుయెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నాతండ్రి యెదుట నేనును ఎరుగనందును" అని యేసు చెప్పెను (మత్తయి 10:32,33).

ఇవన్నియు నేడు దేవుడు మానవుని కిచ్చుచున్న ఆజ్ఞలే. యేసునందు విశ్వసించుము. లేనియెడల నీ పాపములో నీవే నశింతువు. మారుమనస్సు బొంది బాప్తిస్మము పొందుము, దేవుడు నిన్ను దీవించును, నిన్ను రక్షించును. నీవు తిరిగి జన్మించవలెను అని దేవుడు ఆజ్ఞాపించుచున్నాడు. నీవు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను తిరిగి జన్మించవలెనని ఆయన చెప్పుచున్నాడు. దేవుడాజ్ఞాపించును. మానవుడు విధేయత చూపును. నీవు నమ్మి బాప్తిస్మము పొందిన యెడల రక్షించబడుదువు అని యేసు చెప్పుచున్నాడు. నీవు ఆయనకు లోబడిన యెడల ఆయన నిన్ను ఆశీర్వదించును. ఈ ఒక్కొక్క ఆజ్ఞకు నీవు లోబడుద్వారా నీవు నీ రక్షణను సంపాదించుకొనుటకు చేయు పుణ్యకార్యములు కావు యివి. గాని వీటికి విధేయత చూపుటలో దేవుని యెడల నీకున్న ప్రేమను మాత్రము నిరూపించువాడవగుదువు.

అట్లే నీవు క్రైస్తవుడవయిన తరువాత కూడ ఆయన ఆజ్ఞలకు లోబడుచూ యుండవలెను. ఆయన చెప్పిన రీతిగ క్రైస్తవజీవితమును జీవించవలెను. ఆయన

చెప్పిన రీతిగ దేవుని ఆరాధించవలెను. ఆయన నారాధించునపుడు నీవు ఆయన ఆజ్ఞల నుల్లంఘించిన యెడల ఆయన శిక్షకు పాత్రుడవగుదువు. నాదాబు, అబీహులు దేవుని మాటను బట్టి గాక తమ తలంపులను బట్టియే దేవుని నారాధించ ప్రయత్నించిరి. అందువలన మృతులైరి. ఆరాధనలో మనము వాద్యములు లేకుండా పాటలు పాడవలెను, ప్రార్ధన చేయవలెను, వాక్యోపదేశము జరిగించవలెను, ప్రభురాత్రి భోజనము నాచరించవలెను, కానుకలియ్యవలెను అని దేవుడు ఆజ్ఞాపించుచున్నాడు. ఈ ఆరాధనను ప్రతి ఆదివారమున జరిగించవలెను. ఈ ఆజ్ఞలకు లోబడి మనము ఆరాధించిన యెడల ధన్యులమే. లేనియెడల దేవుని ఆజ్ఞల నుల్లంఘించినవారమగుదుము. అయితే అట్టివారి గతి యేమగునో బైబిలు విశదముగా బోధించుచునే యున్నది.

నీవు యెల్లప్పుడు యేసుప్రభువునకు లోబడి జీవించుటకు నిశ్చయించుకో. దేవుడాజ్ఞాపింపగా మానవుడు లోబడవలసినదే యని గ్రహించి జీవించుము. సకలానందము నీదగును.

ఆరాధనాంశములు-4

## ప్రభువు రాత్రి భోజనము

## ( The Lord's Supper )

యేసుప్రభువు ఈ లోకములో సువార్త సేవచేయుకాలము అంతమగుసరికి పస్కా పండుగ సమీపించి యుండెను. శిష్యులు యేసునొద్దకు వచ్చి-పస్కాను భుజించుటకు మేము నీకొరకు ఎక్కడ సిద్ధపరచగోరుచున్నావని అడిగారు (మత్తయి 26:16). వారు ఫలాని మనుష్యునియొద్దకు వెళ్ళి ప్రభువు అతని యింటిలో పస్కాను ఆచరించునని చెప్పి అతనియొద్దకు ఆయన కబురు పంపించారు.

ఇశ్రాయేలీయులు ఐగుప్తులో బానిసలుగా యున్నప్పుడు అద్భుతరీతిగా దేవుడు వారిని విడిపించాడు. ఐగుప్తీయుల యిండ్లలో తొలిచూలు మగవానిని

ఆయన హతముచేసి ఇశ్రాయేలీయులను కనికరించాడు. ఇశ్రాయేలీయులు తమ ద్వారబంధములమీద పూసిన గొర్రెపిల్ల రక్తాన్ని చూచి మరణదూత వారిని దాటిపోయాడు. ఐగుప్తీయులు యెహోవా దేవుని హెచ్చరికలను విశ్వసించక వారి ద్వారబంధముల మీద గొర్రెపిల్ల రక్తాన్ని పూయలేదు. అందువలన ప్రతి యింటిలోను తొలిచూలు మగవాడు మరణించాడు. యూదులు ప్రతి సంవత్సరము పస్కాను ఆచరించుటద్వారా ఈ గొప్ప విమోచనను జ్ఞాపకం చేసికొనేవారు.

## స్థాపించినవాడు ప్రభువే

క్రొత్తనిబంధన కాలంలో పస్కా సమీపించుసరికి యూదులు దాని నాచరించుటకు క్రమంగా సిద్ధపడేవారు. దానిని వారు తమ కుటుంబ సభ్యులతో కలసి ఆచరించేవారు. అటువంటి సందర్భములో ప్రభువైన యేసుక్రీస్తు తనశిష్యులతో కలసి దాన్ని ఆచరించాడు. వారు పస్కాను భుజించుచుండగా యేసు ఒక రొట్టెను తీసికొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించాడు. "దాని విరిచి, వారికిచ్చి-ఇది మీకొరకు ఇయ్యబడుచున్న నా శరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడని చెప్పెను". ఆయన ద్రాక్షారసాన్ని తీసికొని, "ఈగిన్నె మీకొరకు చిందింప బడుచున్న నా రక్తమువలననైన క్రొత్తనిబంధన" అని చెప్పెను (లూకా 22:19,20). ఇకమీదట దేవుని రాజ్యము వచ్చువరకు నేను ద్రాక్షారసము త్రాగనని ఆయన వారితో చెప్పాడు. దీనినే మనం ప్రభువురాత్రి భోజనము అని అంటున్నాం. దీనిని ప్రభువే స్థాపించాడు. మానవజాతి రక్షణార్ధమై ఆయన బలిగా అర్పింపబడబోవు చున్నాడు. ఆయన చేసిన గొప్ప త్యాగాన్ని మనం ఎల్లప్పుడు జ్ఞాపకం ఉంచుకొనేలాగున సంఘారాధనలో ప్రభువు రాత్రి భోజనం ఒక భాగంగా మనకీయబడింది.

## ఎప్పుడు ఆచరించాలి?

ఆనాటి నుండి నేటివరకు, దేవుని ఆరాధించువారు ఎంత కాలాని కొకసారి ప్రభురాత్రి భోజనాన్ని ఆచరించాలి? అనే ప్రశ్నను ఎదుర్కొనుచున్నారు. దానిని ఎప్పుడు ఆచరించాలి? ఎంతకాలాని కొకసారి ఆచరించాలి? క్రొత్తనిబంధన

ప్రకారం, ఆదిమ క్రైస్తవులు ఆదివారమున దానిని ఆచరించారు. అపొ.కా. 20:7లో పౌలు త్రోయకు చేరుకొన్నట్లు మనం చూడగలం. "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్లనై యుండి, వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెను" అని అక్కడ వ్రాయబడియున్నది. ఆదివారమున శిష్యులు పౌలును గూర్చి కూడుకోలేదు గాని, రొట్టెవిరుచుటకు, అంటే ప్రభువు రాత్రి భోజనంలో పాలు పొందుటకు కూడుకొన్నారు. వారు ప్రభువును జ్ఞాపకముంచుకొనుటకు కూడి వచ్చారు. పౌలు వారికి వాక్యమును బోధించాడు; అర్ధరాత్రి వరకు వారితో మాటలాడాడు.

ఆదిమ క్రైస్తవులు ప్రతి ఆదివారమున ప్రభువురాత్రి భోజనములో పాలు పొందుటకై కూడి వచ్చేవారని మనం తెలిసికొనేసరికి అపొస్తలుల ద్వారా లేక పరిశుద్ధాత్మని నడిపింపుద్వారా యిది అమలు పరచబడిందని మనము తెలుసు కోగలము. దేవుడు యిది కోరుచున్నాడని ఆదిమ క్రైస్తవులు గ్రహించి, దాన్ని ఆచరించేవారు. వారిననుకకరించుచు నేటి క్రైస్తవులు కూడ అట్లే చేయాలి. అయితే మతశాఖలవారు ప్రతి ఆదివారమున గాక సంవత్సరానికొకసారి, మూడు లేక ఆరునెలలు కొకసారి ప్రభువు రాత్రి భోజనాన్ని ఆచరిస్తున్నారని మన మెరుగుదుము. వారెట్లు నడుచుకొన్నా, మొదటి శతాబ్దపు క్రైస్తవులయితే ప్రతి ఆదివారము దాన్ని ఆచరించేవారు. వారినే మనం అనుకరించాలి. గాని, మానవకల్పిత బోధలచే కలుషితమైన శాఖలను మాత్రం కాదు.

## ఎవరు పాల్గొనాలి?

ప్రభువురాత్రి భోజనాన్ని గూర్చి మనం ఆలోచించే టప్పుడు దానిలో ఎవరు పాల్గొనాలి? అనే ప్రశ్న రావచ్చును. దేవుని బిడ్డలైనవారు, క్రైస్తవులైనవారు దానిలో పాల్గొనాలి. దానిలో తన శిష్యులు పాల్గొనాలని యేసుప్రభువు ఆజ్ఞాపించాడు. ప్రభువురాత్రి భోజనానికి నేను యోగ్యుడను కాను అని కొందరు వెనుకాడతారు. అయితే వాక్యంలో యోగ్యులు అయోగ్యులు గూర్చి కాక, యోగ్యంగా దాన్ని ఆచరించడాన్ని గూర్చి పౌలు చెప్పాడు. కొరింధు సంఘములో కొందరు దాన్ని తమ

స్వప్రయోజనం కొరకు ఒక శారీరక విందుగా ఆచరించడం మొదలు పెట్టారు. వారు దాన్ని అయోగ్యంగా ఆచరిస్తున్నారు. అందువలన పౌలు వారిని ఖండించాడు. "ఇదేమి? అన్న పానములు పుచ్చుకొనుటకు మీకు ఇండ్లే లేవా?" యని వారినడిగాడు (1కొరింథీ 11:22). ప్రభువురాత్రి భోజనంలోని రొట్టె ద్రాక్షరసములు అందుకొరకు కాక క్రీస్తు మరణాన్ని జ్ఞాపకముంచుకొనడానికని తెలియజేయబడింది. దానిని యోగ్యంగా ఆచరించే విధానాన్ని కూడ పౌలు వారికి ఇట్లు తెలియపరచాడు:

"ప్రభువైన యేసు తాను అప్పగింపబడిన రాత్రియొక రొట్టెను ఎత్తుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, దానిని విరిచి యిది మీకొరకైన నా శరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను. ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన పాత్రను ఎత్తుకొని-యీ పాత్ర నారక్తమువలననైన క్రొత్తనిబంధన; మీరు దీనిలోనిది త్రాగునప్పుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను. మీరు ఈ రొట్టెను తిని యీ పాత్రలోనిది త్రాగునప్పుడెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు" (1కొరింథీ 11:23-26). క్రైస్తవులైన ప్రతి పురుషుడు, ప్రతి స్త్రీ ప్రభువురాత్రి భోజనంలో పాల్గొనాలి. యిది క్రైస్తవారాధనలో ఒక భాగం.

## దాని ప్రాముఖ్యత ప్రయోజనం

ప్రభువురాత్రి భోజనం యొక్క ప్రాముఖ్యత, లేక దాని ప్రయోజనం, లేక భావం యేమిటి? అనే ప్రశ్నలు మనకు రావచ్చును.

మొదటిగా ప్రభువురాత్రి భోజనం ప్రార్థనలో గడిపే ఒక సమయం. మన ప్రభువే ఇందు విషయమై ఒక మాదిరి నిచ్చాడు. ఆయన రొట్టెకొరకు ద్రాక్షారసము కొరకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాడు. ప్రార్థనలో కృతజ్ఞత చెల్లించడం, విన్నపములు చేయడం జరుగుతాయి. మనం రొట్టెను విరిచి భుజించేటప్పుడు ప్రాముఖ్యంగా క్రీస్తు మనకొరకు తన శరీరాన్ని నలుగగొట్టబడుట కిచ్చినందున ఆయనకు కృతజ్ఞత చెల్లించాలి. నలుగగొట్టబడి, గాయపరచబడిన ఆయన శరీరాన్ని మనం

కృతజ్ఞతతో జ్ఞాపకముంచుకోవాలి. దేవుని ఆరాధించుటలో క్రైస్తవులు కూడివచ్చి కృతజ్ఞత చెల్లించే అవకాశము కొరకు మనం దేవునికి వందనాలు, స్తుతులు చెల్లించాలి.

ప్రభువురాత్రి భోజనం సహవాసంలో గడిపే మంచి సమయం. దేవుని కుటంబముగా క్రైస్తవులు కూడి వచ్చి ఒండొరులతోను, దేవునితోను సహవాసము కలిగియుండే మంచి సమయం, ప్రభువురాత్రి భోజన సమయంలో. ప్రభువు బల్లచుట్టు క్రైస్తవులు కూడియున్నప్పుడు, ప్రభువుకూడ వారి మధ్యన ఉంటారు.

సాధారణంగా ఒక కుటుంబమంతా కలసి భోజనం చేసేటప్పుడది ఒక మంచి సహవాససమయం. అట్లే ప్రభువురాత్రి భోజనంలో దేవుని ఆత్మీయ కుటుంబమంతా కలసి పాల్గొంటారు గనుక అది ఒక గొప్ప సహవాస సమయం. "మనము దేవుని పిల్లలమని పిలువబడునట్లు తండ్రి మనకెట్టి ప్రేమనను గ్రహించెనో చూడుడి; మనము దేవుని పిల్లలమే" (1యోహాను 3:1).

మూడవదిగా, ప్రభువురాత్రి భోజన సమయం, ఒక గొప్ప స్మారక సమయం. మనం దానిలో పాల్గొన్నప్పుడు ప్రభువు మనకొరకై సిలువపై మరణించాడని జ్ఞాపక ముంచుకొంటాము. సిలువపై ఆయన రక్తము చిందింపబడెనని మనము జ్ఞాపక ముంచుకొంటాము. ఈ సంగతిని మనం జీవించునంతకాలము జ్ఞాపకముంచు కొనాలని దేవుడు కోరాడు. అందువలన క్రీస్తుసంఘము ఈ లోకంలో యున్నంత కాలము క్రైస్తవులు కూడివచ్చి ఈ స్మారక కూటములో పాల్గొని ప్రభువును మహిమ పరచులాగున ఆయన ప్రభురాత్రి భోజానాన్ని స్థాపించి యిచ్చాడు. దేవుడు తన ప్రజలకేమి చేసాడో దాన్ని కృతజ్ఞతతో జ్ఞాపకముంచుకొనే సమయం ప్రభువురాత్రి భోజనం.

## ఎప్పటి వరకు?

చివరిగా, ప్రభువురాత్రి భోజనం ప్రకటించే సమయం దీనిద్వారా ప్రభువు వచ్చువరకు ఆయన మరణాన్ని మీరు ప్రచురించుదురని పౌలు చెప్పాడు.

ప్రభువురాత్రి భోజనంలో మనం పాల్గొన్నప్పుడు క్రీస్తు మరల రాబోవుచున్నాడనే విశ్వాసాన్ని మరల లోకానికి ప్రకటిస్తాం. ఆయన మరణించాడని, సమాధి చేయబడి మూడవ దినాన్న తిరిగి లేచాడని, మరల రాబోవుచున్నాడని మనం ప్రభువురాత్రి భోజనం ద్వారా ప్రకటిస్తాం. క్రైస్తవుడు తన్నుతాను నూతనపరచుకొని ప్రభువుకు సమర్పించుకొనే అవకాశం ప్రభువురాత్రి భోజనం. దానిని ఆయన చెప్పినట్లు ప్రతి ఆదివారం ఆచరించడం, ఆయన మరల వచ్చేవరకు క్రమంగా అట్లు చేయడం ప్రతి నిజ క్రైస్తవుని బాధ్యతయై యున్నది. దానికి కలపి చెరిపినయెడల తప్పక ఖండించబడతాం. క్రైస్తవారాధనలో ప్రభువురాత్రి భోజనం లేకుండా అది సంపూర్ణ ఆరాధన కానేరదు. ప్రభువు మాటలను మనందరం మన్నించుదము గాక!!

- జాషువా గూటం.

## పరలోకరాజ్యపు తాళపుచెవులు

**( The Keys of the Kingdom )**

(గతసంచిక తరువాయి)

**II.** దేవుని రాజ్యము ఎప్పుడు స్థాపించబడినది ? ఈ సందర్భములో పరిశుద్ధ గ్రంథములోని ప్రవచనములను పరిశీలిద్దాము.

1. ఆరాజుల కాలము : దానియేలు ప్రవక్త దేవునిరాజ్య స్థాపన విషయమై ఆరాజులకాలములో దేవుడు ఒక రాజ్యమును స్థాపించునని చెప్పెను (దాని 2:44).

2. అంత్యదినములు : యెషయ ప్రవక్త మందిరం (దేవునిరాజ్యం) స్థాపన విషయము చెబుతూ అంత్యదినములలో యెహోవా మందిరపర్వతము (దేవునిరాజ్యము) స్థాపించబడునని చెప్పెను (యెష 2:2,3).

పై రెండు లేఖన భాగములలో 1. ఆరాజులకాలము 2. అంత్యదినములు అనగా ఏమిటో ఒక్కసారి ఆలోచిద్దాము.

ఆరాజుల కాలము: బబులోను సామ్రాజ్యాన్ని పాలిస్తున్న నెబుకద్నెజరుకు వచ్చిన కలలోని ప్రతిమకు అర్థము చెప్పుచు;

1. శిరస్సు : బంగారము. ఇది బబులోను సామ్రాజ్యము; మిక్కిలిబలముగా నుండును.

2. భుజములు రొమ్ము : వెండి. ఇది మాదీయ పారశీక సామ్రాజ్యము. బబులోను కంటె కొంచెము బలహీనముగా వుండును. బబులోను సామ్రాజ్యం తరువాత వచ్చును.

3. ఉదరము తొడలు : ఇత్తడి. ఇది గ్రీకు సామ్రాజ్యము. ఇది మాదీయపారశీక సామ్రాజ్యముకంటె కొంచెము బలహీనముగా ఉండును.

4. మోకాళ్ళు, పాదములు : మోకాళ్ళు ఇనుమును, పాదములు ఇనుము మట్టియు కలిసియున్నవి. ఇది రోమా సామ్రాజ్యము. ముందు చెప్పిన రాజ్యములన్నిటి కంటె బలహీనముగా ఉండును. దానియేలు చెప్పిన ప్రవచనం ప్రకారం, ఈ నాల్గవ రాజ్యకాలములో దేవునిరాజ్యము స్థాపించబడవలసి యున్నది. బబులోను, మాదీయ, గ్రీకురాజుల కాలములో రాజ్యము స్థాపించబడి యుండలేదనుట నిర్వివాదాంశము కాబట్టి ప్రవచనం ప్రకారం రోమా రాజుల కాలములో దేవుని రాజ్యం స్థాపించబడవలసియున్నది.

2. అంత్యదినములు : ఈ అంత్యదినములను లోకాంత్యపు దినములని బోధించుచు మతశాఖలవారు మిక్కిలి గందరగోళము కలిగించుచున్నారు. ఈ విషయమై ప్రభువుచెప్పిన మాటలు ఒక్కసారి మనన చేసికొందాము. యేసుక్రీస్తు ఆయన శిష్యులు ఒకరోజు కొండమీద ఏకాంతముగా కూర్చున్నప్పుడు, శిష్యులు ప్రభువును 2ప్రశ్నలు అడిగినారు. 1. ఇవి ఎప్పుడు జరుగును? 2. నీ రాకడకును ఈ యుగ సమాప్తికిని సూచనలేవి?

రెండవప్రశ్నలో రెండు అంశములున్నవి. 1. యేసుక్రీస్తు రెండవరాకడ 2. ఈ యుగసమాప్తి. యుగసమాప్తి అనునది మొదటి ప్రశ్నకు సంబంధించినదై యున్నది. అనగా మొదటి ప్రశ్నలో "ఇవి ఎప్పుడు జరుగును" ఈ యుగసమాప్తికి సూచనలేవి? ఈ రెండును ఒకే అంశమునకు సంబంధించినవై యున్నవి.

మొదటి ప్రశ్న:-ఇవి ఎప్పుడు జరుగును? ఈ యుగసమాప్తికి సూచనలేవి? ఈప్రశ్నను రెండు భాగములుగా విశజించవలెను.

a. ఇవి ఎప్పుడు జరుగును?: యేసుక్రీస్తు శిష్యులు యెరూషలేము దేవాలయమును ఆయనకు చూపించుచు దానిని గూర్చి పొగడుచుండగా "ఆయన ; మీరు యివన్నియు చూచుచున్నారుగదా? రాతిమీద రాయి ఒకటియైనను యిక్కడ నిలిచి యుండకుండ పడద్రోయబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని" వారితో అనెను (మత్తయి 24:1,2). ఇవి ఎప్పుడు జరగును? అనువారి ప్రశ్న, ఈ దేవాలయమును రాతిమీద రాయి నిలచి యుండకుండ ఎప్పుడు పడద్రోయబడునని అర్ధమైయున్నది. ఇది రోమారాజులు కాలములో క్రీ.శ. 70లో తీతు అను సైన్యాధిపతి యెరూషలేముపై దండెత్తి యెరూషలేమును నాశనము చేసెను. లక్షలాది మనుష్యులు వధించబడి యెరూషలేము వీధులలో రక్తము ప్రవహించెను. యేసుక్రీస్తు చెప్పిన ఆ ప్రవచనము యిట్లు నెరవేర్చబడెను.

b. ఈయుగ సమాప్తికి సూచనలేవి?: ఈ యుగము అనగా నేమిటో ముందుగా తెలియవలసి యున్నది. బైబిలు కాలమును 3 యుగములుగా విభజింపబడియున్నది. 1. పితరుల యుగము; అనగా ధర్మశాస్త్రమునకు ముందున్నకాలము. 2. ధర్మశాస్త్రయుగము; అనగా క్రొత్తనిబంధనకు ముందు కాలము. 3. క్రీస్తు యుగము లేక క్రైస్తవయుగము. శిష్యులు

ఈ ప్రశ్న అడిగినపుడు వారు ధర్మశాస్త్రపు యుగములోనే ఉన్నారు. ఆతరువాత కొద్దికాలమునకే క్రీస్తు యుగము లేక క్రైస్తవయుగము వచ్చినది కాబట్టి అప్పుడు వారు ధర్మశాస్త్ర యుగపు అంతములో ఉన్నారు. ఈ దినములనే యెషయా ప్రవక్త "అంత్యదినము" లని ప్రవచించినారు. బైబిలునందు, అంత్యదినములు, ఈ దినముల అంతము, కడవరి కాలము, ఈ యుగసమాప్తి అను పదములు రోమా సామ్రాజ్యపు చివరి దినములను గూర్చియే చెప్పబడినది. ఈ సందర్భములో ప్రభవు పలికిన మాటలు జ్ఞాపకము చేసికొందాము. "అనేకులు నా పేరిట వచ్చి నేనే క్రీస్తునని చెప్పి పలువురిని మోసపర్చెదరు. మరియు వీరు యుద్ధములను గూర్చియు, యుద్ధసమాచారములను గూర్చియు వినబోదురు. మీరు కలువర పడకుండ చూచుకొనుడి. ఇవి జరుగవలసి యున్నదిగాని అంతము వెంటనే రాదు" (మత్తయి 24:5,6).

2. నీ రాకడకు సూచనలేవి? : యేసుక్రీస్తు యెరూషలేము దేవాలయము నాశనమును గూర్చియు, ఈ (ధర్మశాస్త్ర) యుగసమాప్తికి సూచనలు యిచ్చెనుగాని, రెండవరాకడ విషయమై ఎట్టి సూచనలు యిచ్చి యుండలేదు. అయినను యేసు రాకడ విషయమై చెప్పిన కొన్ని సంగతులను చూద్దాం.

(1) "అయితే ఆ దినమును గూర్చియు, ఆగడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగును గాని, ఏ మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను కుమారుడైనను ఎరుగడు" మత్త 24:36.

(2) "మీరనుకొనని ఘడియలో మనుష్య కుమారుడు వచ్చును. కనుకనే మీరును సిద్ధముగా ఉండుడి" (మత్త 24:44).

(3) "ఆదినమైనను ఆ ఘడియైనను మీకు తెలియదు గనుక మెలకువగా నుండుడి" (మత్తయి 25:13).

(4) "కాలములు సమయములను తండ్రి తన స్వాధీనమందుంచుకొనియున్నాడు. వాటిని తెలిసికొనుట మీ పనికాదు" (అపొ.కా. 1:7).

పరిశుద్ధాత్మ్మడైతే "ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును" అని చెప్పుచున్నాడు (2పేతు 3:10, 1థెస్స 5:2).

అంత్యదినములు అనగా లోకాంత్యపు దినములు కావని పరిశుద్ధ గ్రంథము ఉద్ఘాటించుచున్నది. కాబట్టి అంత్యదినములు అనగా ధర్మశాస్త్రపు అంత్యదినములు లేదా రోమా సామ్రాజ్యపు అంత్యకాలము. ఈ అంత్యదినములలోనే దేవునిరాజ్యము స్థాపించబడినది.

ఎప్పుడు స్థాపించబడినది?: 1వ అంశములో దేవుని పర్వతము, మందిరము, రాజ్యము,సంఘము ఒకటియే యని తెలిసికొనియున్నాము. ఈ విషయమై మరికొంత తెలిసికొందాము.

యేసుప్రభువు మత్త 16:18లో పేతురుతో " ఈబండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోకద్వారములు దానియెదుట నిలువనేరవని నీతో చెప్పుచున్నానెను". 19వ వచనములో "పరలోకపు రాజ్యపుతాళపు చెవులు నీకిచ్చెదను" అని చెప్పెను. 18వ వచనములో సంఘము స్థాపించెదనను మాట 19వ వచనములోని "పరలోకరాజ్యపు తాళపు చెవులు" యిచ్చెదనను మాటలో సంఘము, పరలోకరాజ్యము ఒకటే యని స్పష్టమగుచున్నది.

మరియు యేసు నికోదేముతో "ఒకడు నీటిమూలము గాను, ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని" చెప్పుచున్నాడు.యోహాను 3:3-5. అనగా బాప్తిస్మము పొందినవాడే దేవుని రాజ్యములో ప్రవేశించుననునది బైబిలు సత్యము. అందుకే పరిశుద్ధాత్ముడు "రక్షణపొందుచున్న వారిని ప్రభువు వారితో అనగా సంఘముతో చేర్చుచున్నాడని చెప్పెను (అ.కా. 2:47). కాబట్టి సంఘము అనగా దేవుని రాజ్యమనుటకు ఎట్టి సందేహము లేదు.

అయితే సంఘము అను యీ రాజ్యము ఎప్పుడు స్థాపించబడినది?

యెషయా, దానియేలు ప్రవచనముల ప్రకారం అంత్యదినములలో అనగా ధర్మశాస్త్ర యుగాంతమందు అనగా పెంతెకోస్తు దినమునందు శిష్యులందరు ఒకచోట కూడియుండగా పరిశుద్ధాత్మతో నిండినపుడు దేవునిరాజ్యము బలముతో వచ్చెను (అపొ.కా. 2:1-4). తదుపరి పేతురు బోధించిన వాక్యమునకు విధేయులై బాప్తిస్మము పొంది రాజ్యములో చేర్చబడిరి. కాబట్టి దేవునిరాజ్యము పెంతెకోస్తు దినమున అనగా క్రీస్తు శకము 33లో స్థాపించబడినది.

## III. ఎక్కడ స్థాపించబడినది ?

### A. ప్రవచనములు:-

1. ప్రవక్తయైన దావీదు యిట్లు ప్రవచించెను: "... యెహోవా నీ పరిపాలనా దండమును సీయోనులోనుండి సాగజేయుచున్నాడు. నీ శత్రువుల మధ్యను నీవు పాలన చేయుము" కీర్తనలు 110:1,2. (మీకా 4:2 చూడుము).

ఈ వాక్యములో తండ్రియైన దేవుడు యేసుక్రీస్తుతో సీయోనులోనుండి అనగా యెరూషలేమునుండి నీ పాలన ప్రారంభించి నీ శత్రువుల మధ్య పాలన చేయుమని చెప్పుచున్నాడు.

2. యెషయా ప్రవక్త యీలాగు ప్రవచించెను: "ప్రభువగు యెహోవా... సీయోను (యెరూషలేము)లో పునాదిరాతిని వేసినవాడవు. దీనిని బట్టి రాజ్య(సంఘ) స్థాపన పునాదిరాయిని యెరూషలేములో వేసినట్లు చెప్పుచున్నాడు.

B. యేసుక్రీస్తు వాగ్దానములు : 1. పరిశుద్ధాత్మని చేత ఏర్పరచబడిన తనశిష్యుల ద్వారా క్రీస్తురాజ్యము (సంఘము) స్థాపించబడవలసియున్నది. అందువలన క్రీస్తు యీక్రింది వాగ్దానములు చేసెను.

1. "ఇదిగో నాతండ్రి వాగ్దానము చేసినది మీ మీదికి పంపుచున్నాను; మీరు పైనుండి శక్తి పొందువరకు పట్టణములో నిలిచియుండుడని చెప్పెను". లూకా 24:49. ఇక్కడ, పట్టణమనగా యెరూషలేము పట్టణమని గ్రహించ వలెను.

2. "ఆయన వారిని (శిష్యులను) కలసికొని యీలాగు ఆజ్ఞాపించెను. మీరు యెరూషలేమునుండి వెళ్ళక నా వలన వినిన తండ్రి యొక్క వాగ్దానము కొరకు కనిపెట్టుడి" (అపొ.కా. 1:4).

C. శిష్యులు : -

1. అప్పుడు వారు ఒలీవల వనమనబడిన కొండనుండి యెరూషలేమునకు తిరిగి వెళ్ళిరి (అపొ.కా. 1:12).

2. యేసుక్రీస్తు వాగ్దానము ప్రకారము శిష్యులు యెరూషలేములో పెంతెకోస్తు దినమున కూడియుండగా "దేవునిరాజ్యము" బలముతో వచ్చెను. అపొ.కా. 2:1-5. కాబట్టి దేవునిరాజ్యము యెరూషలేములో స్థాపించబడెను. ఈరాజ్యము;

   (a.) దేవుని రాజ్యము భూమిమీద స్థాపించబడెను (అపొ.కా. 2:1-4).

   (b.) పెంతెకోస్తు దినమున (క్రీ.శ. 33లో) స్థాపింపబడెను (అపొ.కా. 2అధ్యా).

   (c.) యెరూషలేములో స్థాపించబడెను (అపొ.కా. 1:12, 2:1-5).

**IV.** ఆరాజ్యమేది ? :- ఆరాజ్యము సంఘమే. క్రింది విషయములను పరిశీలించుము.

ఆరాజ్యమునకు గల ముఖ్య అంశములు:-

1. రాజు : యేసుక్రీస్తు (1తిమోతి 6:15).

2. రాజ్యము : సంఘము (మత్తయి 16:18,19, అపొకా. 20:28).


3. రాజ్యపౌరులు : సంఘసభ్యులు (అపొ.కా. 2:1-4,41).

4. చట్టము : క్రొత్తనిబంధన (అపొ.కా. 2:42).

E. 1. ఆరాజ్యము : మందిరము (2సమూ7:12,13).

2. ఆ మందిరము : సంఘము (1తిమోతి 3:14,15).

3. ఆ సంఘము : ఆయన శరీరము (ఎఫెసీ 1:22,23).




2సమూ 7:12,13 యెషయా 2:2 హెబ్రీ 3:5,6.

1. ఆరాజ్యము క్రీస్తురాజ్యము

2. ఆమందిరము క్రీస్తుమందిరము

3. ఆ సంఘము క్రీస్తుసంఘము.

ఈ సంఘము (రాజ్యము)ను యేసుక్రీస్తు పాలించుచున్నాడు. అటు తరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును కొట్టివేసి తన తండ్రియైన దేవుని రాజ్యమును అప్పగించును; అప్పుడు అంతము వచ్చును (1కొరింథీ 15:24).

ఇంకను రాజ్యము కొరకు నిరీక్షించుచు, ప్రార్థించువారలారా, యిప్పుడైనను మేల్కొని బాప్తిస్మము పొంది క్రీస్తురాజ్యము(సంఘము)లో చేరి రక్షణ పొందవలెనని ఆయన రాజ్యముతోడ మిమ్ములను బ్రతిమాలుచున్నాను.

ఇప్పుడు పరలోక రాజ్యపు తాళపుచెవులను గూర్చి తెలిసికొందాము: తాళపు చెవులు అనగా ఇనుము, ఇత్తడి, వెండియు, బంగారువియు కావు. రోమన్ కేథలిక్ వారు చెప్పుచున్నట్లు పేతురుకు యిచ్చిన అధికారము అంతకంటే కాదు. తాళపుచెవియనగా దేవుని వాక్యమే .మామూలు తాళపు చెవి ద్వారా గృహద్వారములు ఎలా తెరువబడతాయో ఆలాగుననే "వాక్యము" అను తాళపుచెవి ద్వారా దేవుని రాజ్యము యొక ద్వారము తెరువబడును. యేసుప్రభువుచేత వాగ్దానము పొందిన పేతురు పెంతెకోస్తు దినము. యేసును చంపిన యూదుల మధ్య యేసుక్రీస్తు మరణ పునరుత్థానములను గూర్చి ప్రకటించెను. మీరు సిలువవేసినట్టి ఈ యేసునే దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించెను. అందుకు మేము సాక్షులము. కావున ఇప్పుడైనను ముష్కరులగు యీతరము వారికి వేరై మీరు మారుమనస్సు పొంది యేసుక్రీస్తును ఒప్పుకొని పాప క్షమాపణ నిమిత్తము ప్రతి వాడును యేసుక్రీస్తు నామమున, బాప్తిస్మము పొందుడని వారిని హెచ్చరించెను. అతని వాక్యము అంగీకరించిన వారు 3వేల మంది బాప్తిస్మము పొంది దేవుని రాజ్యము(సంఘము)లో చేర్చబడిరి (అపొ.కా. 2:14-41). ఇట్లు ప్రకటించిన వాక్యమే తాళపు చెవి. తెరువబడినదే దేవుని రాజ్యము (ప్రకటన 3:8చూడుము).

చివరిగా, మత్తయి 16:18,19 వచన భాగములో బంధించుట ఎప్పుడు అనునది. దేవునిరాజ్యములో చేర్చుకొనుట, చేర్చుకొనక పోవుట అను అధికారము పేతురున కిచ్చుట కాదుగాని, సంఘము ద్వారా తానే బంధించుటకును విప్పుటకును దేవుడు అధికారియై యున్నాడు. "నేను దావీదు ఇంటితాళపు అధికార భారమును అతని భారమును అతని భుజముల మీద ఉంచెదను. అతడు తీయగా ఎవడును మూయజాలడు. అతడు మూయగా ఎవడును తీయజాలడు". యెష 22:22 మరియు మత్తయి 18:15-22 రికార్డు చూచిన యెడల తప్పిదము చేసిన వానిని

విడిపించుటకును బంధించుటకును సంఘమునకు అధికారము నిచ్చెను. దీనినే యోహాను 20:22,23లో ధృవపర్చెను. ఇది సంఘమునకు యిచ్చిన అధికారమునకు గాని, పేతురుకు యిచ్చిన అధికారముకాదు. పేతురు కేవలము నిమిత్త మాత్రుడు కాబట్టి తాళపుచెవియనగా వాక్యము, తెరువబడినది (దేవునిరాజ్యము) సంఘమని రూఢి యగుచున్నది.

ప్రియచదువరీ! నీవు యింకను ఇట్టి దేవుని (రాజ్యము) సంఘములో సభ్యుడవు కానియెడల, నేడే సత్యవాక్యమునకు విధేయుడవై బాప్తిస్మము ద్వారా క్రీస్తు (రాజ్యము) సంఘములో చేరుమని మరొకసారి ప్రభువు నామమున బ్రతిమాలుచున్నాను.

- జి. మార్కు, నందిగామ.

## పునరుత్థానము - రక్షణ

## ( The Resurrection and Salvation )

పునరుత్థాన అధ్యాయమగు 1కొరింథీ 15 ను మనము చదివిన యెడల క్రీస్తు పునరుత్థానమునకును మానవుని రక్షణకును గల సంబంధమును తెలిసి కొనగలము. మృతులలో నుండి యేసుక్రీస్తు లేచుటలో ఆయన దైవత్వాన్ని పరలోకము మనకు ప్రకటించినది. "యేసుక్రీస్తు మృతులలో నుండి పునరుత్థానుడు అయినందున పరిశుద్ధమైన ఆత్మను బట్టి దేవుని కుమారుడుగా ప్రభావముతో నిరూపింపబడెను" (రోమా1:7). అతిబలవంతుడైన మరణముపై మన ప్రభువు తనకు గల శక్తిని నిరూపించెను.

దైవావేశ లేఖకులు క్రీస్తు మరణమును గూర్చి యెక్కువ సమయమును వెచ్చించిరి. సిలువయందు మాత్రమే అతిశయించిన పౌలు తాను సిలువ వేయబడిన క్రీస్తునే ప్రకటించెననియు, తాను ప్రకటించు వర్తమానమునకు క్రీస్తుయొక్క మరణమే ఆధారమని వక్కాణించెను (1కొరింథీ 1:23; 2:1-2). అయితే అతడు

ప్రకటించు రక్షణ సువార్తలో క్రీస్తుయొక్క మరణమే గాక ఆయన పునరుత్థానము కూడ ఇమిడి యున్నదని అతడు బోధించెను (1కొరింథీ 15:20).

క్రీస్తుయొక్క పునరుత్థానము క్రైస్తవుడు కూడ మృతులలో నుండి లేపబడునని చేయబడిన వాగ్దానము :"ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడి యున్నాడు" (1కొరింథీ 15:20). క్రీస్తుయొక్క పునరుత్థానమును, మన పునరుత్థానమును నిరాకరించుట నాస్తికత్వమగును. మానవుని రక్షించు దేవుని పథకములో ఆత్మీయ మరణము నుండి విమోచన మాత్రమే గాక (ఎఫెసీ 2:1,2) భౌతిక మరణము నుండి శరీరము యొక్క విమోచన కూడ ఇమిడి యున్నది. "అంతేకాదు ఆత్మయొక్క ప్రథమఫలముల నొందిన మనము కూడ దత్త పుత్రత్వము కొరకు అనగా మన దేహముయొక్క విమోచనము కొరకు కనిపెట్టుచు మనలో మనము మూలుగుచున్నాము" (రోమా 8:23).

మృతినొందుటకు గాక జీవించుటకు దేవుడు మానవుని సృజించెను. మానవుడు జీవించుటకుగాను తగిన యేర్పాట్లను దేవుడు చేసెను; ఏదేను వనములో ఆయన జీవవృక్షము నుంచెను. మానవుని అవిధేయతవలన భౌతిక మరణమువలె శారీరక మరణము సంప్రాప్తమాయెను. దేవునికి వ్యతిరేకముగా పాపము చేయుటవలన దేవుడతని కొరకై సిద్ధపరచిన స్థలమును, జీవవృక్షమును పొందే హక్కును మానవుడు కోల్పోయెను. అయితే మన ప్రభువు తన ప్రజలకొరకై సిద్ధపరచే స్థలములో జీవ వృక్షముండుటయే గాక, అది నిత్యము ఫలములను ఫలించును! (ప్రకటన 22:2).

- టామ్ హోలండ్.

"పూర్వకాలమందు నానా సమయములలోను, నానా విధములుగాను మన పితరులతో మాట్లాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాట్లాడెను" (హెబ్రీ 1:1, 2). పితరుల యుగంలో ఆయన కుటుంబ యజమానులతోను, మోషే యుగంలో ఇశ్రాయేలీయులతో మధ్యవర్తుల ద్వారాను ఆయన మాటలాడెను. ఆయన ఇశ్రాయేలీయులతో ఒక నిబంధన చేసెను. క్రీస్తు యుగారంభములో తన కుమారుని ద్వారా ఆయన సర్వమానవాళితో మాటలాడెను. క్రీస్తు మాటలు లేక ఆయన బోధ పరిశుద్ధాత్మ ప్రేరణచే క్రొత్త నిబంధనగా గ్రంధస్థము చేయబడెను. మన జీవమునకును, భక్తికిని కావలసిన వాటినన్నిటిని క్రొత్తనిబంధన లేఖనములు తెలియజేయుచున్నవి. అది సంపూర్ణమైన శ్రేష్టమైన నిబంధన. నూతనంగా నేడు దేవుడు బయలు పరచవలసిన సంగతులున్నాయని భావించేవారు బైబిలును అసంపూర్ణ గ్రంధముగా చేయుచున్నారు.

లిఖిత పూర్వకమైన తన వాక్యము ద్వారా దేవుడు నేడు మనతో మాట్లాడు చున్నాడు. పరిశుద్ధ లేఖనముల కంటే ఎక్కువగాని తక్కువగాని మనం బోధించరాదు. ఇంకోమాటలో లేఖనములను అతిక్రమించరాదు (1కొరింథీ 4:6). దేవుని దర్శనము కలిగినదని, ఆయన నేడు నేరుగా మాట్లాడుచున్నాడని బోధించువారు లేఖనముల నెరుగని అబద్ధ బోధకులు. ఇశ్రాయేలీయులు మోషేతో యిట్లనిరి: "నీవు మాతో మాటలాడుము, మేము వినుము. దేవుడు మాతో మాట్లాడిన యెడల మేము చనిపోవుదుము" (నిర్గమ 20:19). "సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వము గలవాడై యున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు. ఎవడును ఆయనను చూడనేరడు" (1తిమోతి 6:16).

యేసుప్రభువు "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి" యనే గొప్ప ఆజ్ఞను తన అపొస్తలుల కిచ్చిన నాటినుండే రక్షణ సంకల్పమును మానవులకు మానవులే లేఖనముల నుండి అందియ్యాలి గాని, దేవదూతలు గాని, దర్శనములు గాని మరొక విధంగా గాని కాదు. ఐతియోపీయునికి సువార్త ప్రకటించుటకు ప్రభువు దూత ఫిలిప్పును పంపెను. దూత తానే వెళ్ళి స్వయంగా సువార్తను ప్రకటించలేదు. అపొస్తలుల కార్యములలో మార్పుజెందిన వారి ప్రతి సందర్భములోను రక్షణ మార్గమును మానవులకు మానవులే ప్రకటించిరి. అది

నేటికిని అట్లే యున్నది. దేవుని చిత్తాన్ని తెలిసికోవాలంటే మనము లేఖనములను చదవాలి. వేరే విధంగా ఆయన మనతో మాటలాడడు.

సోదరులు రోయస్ గారు, జాషువా గూటం గారు ఈ సదస్సులో పాల్గొని టి.సి.హెచ్. ఫ్లెమింగ్స్, టి. ఆనందరావ్ మరియు తదితర బోధకులతో సహవాక్యపరిచర్య చేసిరి. ఫ్లెమింగ్స్ గారి కుటుంబము, గుడివాడ స్థానిక సంఘము చక్కటి ఏర్పాట్లు చేసి వచ్చినవారికి గొప్ప ఆతిథ్యమిచ్చిరి.

డిశంబరు 7నుండి 12వరకు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో జరుపబడు ఏషియన్ బైబిల్ లెక్చర్‌షిప్ మరియు సెమినార్ కొరకు ఈ పత్రిక ముద్రింపబడు సరికి (నవంబరు 29నాటికి) అన్ని ఏర్పాట్లు చేయబడియున్నవి. వాటి వివరములు వచ్చే సంచికలో.

R. gd. No. H / KD-45 / K.D. H.
Date of Posting : 15 th of Every month

From:
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA - 533 001

To